www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

విలేకరులు కావలెను

తెలుగు రాష్ట్రాల నుండి విడుదలవుతున్న

సంచలన సమాచార దినపత్రిక 'సిద్దిపేట పవర్' తెలుగు దినపత్రికలో

పనిచేయుటకు అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్ లు ఆర్సి ఇంచార్జ్ లు కావలెను


ఆసక్తి ఉన్నవారు వెంటనే సంప్రదించండి

ఫోన్ : 9866338848

www.siddipetpower.com

PUBLISHED FROM: HYDERABAD | సంపుటి: 00 | సంచిక: 00 | శనివారం, 22 మార్చి, 2025 | ఎడిటర్: ............................ | పేజీలు: 04 | వెల: 3 రూ/-

# వారిపై కఠినంగా ఉండాలి



- డీజీపీకి సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు
- భారతరత్న అంబేద్కర్‌ను అగౌరవపరిచేలా విగ్రహం పట్ల దుశ్చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు

**అమరావతి**

తూర్పు గోదావరి జిల్లాలోని నల్లజర్ల మండలంలో గల దూబచర్లగాంధీ కాలనీలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాన్ని అవమానించిన ఘటనను ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఖండించారు. ఈ ఘటనపై ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాతో ఇవాళ(శనివారం) రాష్ట్ర సచివాలయంలో సమీక్ష చేశారు. నిందితులపై కఠిన చర్యలకు ఆదేశించారు. భారతరత్న అంబేద్కర్‌ను అగౌరవపరిచేలా విగ్రహం పట్ల దుశ్చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీకి సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటనపై డీజీపీ, పోలీస్ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు. ఈ ఘటనపై పూర్తి వివరాలను సీఎం చంద్రబాబుకు డీజీపీ తెలిపారు. ఈ ఘటనలో కుట్ర కోణాన్ని వెలికి తీయాల్సిందిగా డీజీపీని ఆదేశించారు. దీనిపై దర్యాప్తు ప్రారంభించినట్లు సీఎంకు డీజీపీ తెలిపారు. నిందితులను గుర్తించి అరెస్టు చేసేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు సీఎంకు వివరించారు. వర్గాల మధ్య విద్వేషాలు



## రాష్ట్రానికి అన్యాయం జరగకుండా డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టాలి

- ప్రధాని మోదీకి జగన్ లేఖ
- నియోజకవర్గాల పునర్ విభజన ప్రజాస్వామ్య సమాఖ్య స్ఫూర్తిని నిలబెట్టాలి
- లోక్‌సభ లేక రాజ్యసభలో ఏ రాష్ట్రానికీ సీట్ల వాటా తగ్గకుండా డీలిమిటేషన్ ప్రక్రియ జరగాలి
- దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతున్న విషయాన్ని మీ దృష్టికి తీసుకొస్తున్నాను
- డీలిమిటేషన్ ద్వారా కొన్ని రాష్ట్రాల్లో సీట్లు తగ్గుతాయి
- దాని వల్ల చట్టాల రూపకల్పన, సవరణలలో దక్షిణాది రాష్ట్రాల ప్రభావం ఏమాత్రం ఉండదు
- రాజకీయంగానే కాదు ప్రజల ప్రయోజనాల్ని ఇది దెబ్బతీస్తుంది.

**విజయవాడ**

డీలిమిటేషన్ ప్రతిపాదన ద్వారా దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని, చట్టాల రూపకల్పనలో మన ప్రాధాన్యత అవసరమే లేకుండా పోతుందని చెన్నైలో స్టాలిన్ నేతృత్వంలో విపక్ష నేతల సమావేశం జరుగుతోంది. ఈ సమయంలో ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి డీలిమిటేషన్ ప్రక్రియపై -



## ఆన్‌లైన్ గేమింగ్ వెబ్‌సైట్స్‌పై కేంద్రం కొరడా

- 357 వెబ్‌సైట్స్ బ్లాక్..!
- దాదాపు 2,400 బ్యాంక్ ఖాతాలు అటాచ్.. రూ.126 కోట్లను ఫ్రీజ్
- మనీ గేమింగ్ ప్లాట్‌ఫామ్స్‌తో అప్రమత్తంగా ఉండాలని..
- కొన్ని సంస్థలను నమోదు చేయకుండా, ఆదాయాన్ని దాచిపెడుతూ జీఎస్టీ ఎగవేతలకు పాల్పడుతున్న చట్టవిరుద్ధమైన ఆన్‌లైన్ మనీ గేమింగ్ ప్లాట్‌ఫామ్స్‌పై చర్యలు

# ఆ వార్తలు కేవలం ఊహాగానాలు..

- లేఖ విడుదల చేసిన జనసేన
- చెన్నైలో డీలిమిటేషన్ సమావేశంపై జనసేన క్లారిటీ
- డీలిమిటేషన్ మీటింగ్‌కు జనసేన తరపున ప్రజా ప్రతినిధులు హాజరైనట్లు ప్రచారం
- ఈ సమావేశంలో జనసేన నుంచి ఎవరు హాజరుకాలేదని పార్టీ స్పష్టీకరణ
- ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా లేఖ విడుదల

జనసేన

**అమరావతి**

చెన్నైలో తమిళనాడు సీఎం స్టాలిన్ ఆధ్వర్యంలో జరిగిన డీలిమిటేషన్ మీటింగ్‌కు ఏపీ నుంచి జనసేన పార్టీ ప్రజా ప్రతినిధులు హాజరైనట్లు ప్రచారం జరుగుతోంది. కానీ, ఈ సమావేశంలో జనసేన తరపున ఎవరు హాజరుకాలేదు. ఇదే విషయమై జనసేన పార్టీ సోషల్ మీడియా వేదికగా ప్రత్యేకంగా ఒక లేఖను విడుదల చేసింది. తాము సీఎం స్టాలిన్ నిర్వహించిన డీలిమిటేషన్ మీటింగ్‌కు హాజరైనట్లు వస్తున్న వార్తలు కేవలం ఊహాగానాలు మాత్రమేనని ఈ లేఖ ద్వారా స్పష్టం చేసింది. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన(డీలిమిటేషన్)పై శనివారం చెన్నైలో డీఎంకే పార్టీ అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి జనసేన పార్టీకి ఆహ్వానం పంపించింది. అయితే ఈ భేటీకి హాజరుకాలేమని జనసేన ప్రతినిధులు సమాచారం

- మిగతా3లో



## సొంత దేశంలోనే రాజకీయ అధికారాలు కోల్పోతాం

- డీలిమిటేషన్‌పై స్టాలిన్
- నియోజకవర్గాల పునర్విభజనకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పార్టీలు తీర్మానం
- ప్రస్తుతానికి జనాభాప్రాతిపదికన జరిగే డీలిమిటేషన్‌తో కొన్ని రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుంది
- కేంద్రం చేపట్టే చర్యలపై పోరాటానికి ప్రత్యేకంగా జేఏసీ ఏర్పాటు
- జనాభా ఆధారిత పునర్విభజన వల్ల దక్షిణ భారత రాష్ట్రాలకు చట్టాల రూపకల్పనలో ప్రాతినిధ్యం తగ్గుతుంది

# ఆ విజయానికి కారణం చంద్రబాబే



- 175 సీట్లలో 164 సీట్లు కూటమికి ఇచ్చారు
- ఎన్డీయే కూటమిని 21 ఎంపీ స్థానాల్లో గెలిపించారు
- ఏపీ వ్యాప్తంగా పల్లె పండుగ విజయవంతం కావడానికి అనుభవజ్ఞుడైన చంద్రబాబే కారణమన్నారు
- రాష్ట్రం బాగుండాలని సీఎం చంద్రబాబు కోరుకుంటారు
- ముఖ్యమంత్రి స్ఫూర్తితోనే తాను పనిచేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి స్పష్టం

**కర్నూలు**

రాష్ట్ర వ్యాప్తంగా 1.55 లక్షల ఫారం పాండ్ నిర్మాణంలో భాగంగా ఓర్వకల్లు మండలం పూడిచెర్ల గ్రామంలో రైతు రాజన్న పొలంలో ఫాం పాండ్ నిర్మాణ పనులకు ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ భూమి పూజ చేశారు. అనంతరం పూడిచెర్లలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. దేశం మొత్తం ఏపీ వైపు చూస్తోందన్నారు. కష్ట సమయంలో కూటమిని గెలిపించారని.. 175 సీట్లలో 164 సీట్లు కూటమికి ఇచ్చారన్నారు. ఎన్డీయే కూటమిని 21 ఎంపీ స్థానాల్లో గెలిపించారని తెలిపారు. ఏపీ వ్యాప్తంగా పల్లె పండుగ విజయవంతం కావడానికి అనుభవజ్ఞుడైన చంద్రబాబే కారణమన్నారు. రాష్ట్రం బాగుండాలని సీఎం చంద్రబాబు కోరుకుంటారని.. ముఖ్యమంత్రి స్ఫూర్తితోనే తాను పనిచేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. జాతీయ ఉపాధి .



## చైనా దురాక్రమణను భారత్ ఎన్నటికీ అంగీకరించబోదు

- కేంద్రం స్పష్టీకరణ
- లధఖ్ భూభాగంలోని కొన్ని ప్రాంతాల్లో కౌంటీలను ఏర్పాటు
- కౌంటీలతో పాటు సరిహద్దు ప్రాంతాల్లో చైనా చేపడుతున్న అభివృద్ధి ప్రాజెక్టుల గురించి కూడా తమకు సమాచారం ఉందని వెల్లడి
- చైనా పాల్పడుతున్న చట్టవిరుద్ధమైన, బలవంతపు ఆక్రమణను భారత్ చట్టబద్ధం చేయబోదు

## సిఫార్సు లేఖలపై తెలంగాణ ప్రజాప్రతినిధుల శ్రీవారి దర్శనం

మార్చి 25 మరియు మార్చి 30వ తారీఖుల్లో శ్రీవారి ఆలయంలో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు



**తిరుమల**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు గౌరవనీయులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రతినిధుల సిఫార్సు లేఖలకు శ్రీవారి దర్శనం సోమవారం అనగా మార్చి 24వ తారీఖు నుండి అమలులోకి రానుంది. ఇందులో భాగంగా ఆదివారం నాడు సిఫార్సు లేఖలు స్వీకరించడం జరుగుతుంది. అయితే ఇదివరకే టీటీడీ ప్రకటించిన విధంగా ఈనెల 30వ తారీఖున -

# సంపాదకీయం

## చమురు సంక్షోభం పొంచివున్నదా?

పశ్చిమాసియాలో ఎలాంటి సంఘర్షణలు ఎదురైనా భారతీయ వాణిజ్య రంగానికి సంక్షోభం తప్పదు. చమురు, సహజ వాయువు, ఎరువులు, తదితర ముఖ్య అవసరాలు సరిగ్గా సరఫరా కాక, వాణిజ్యంలోనే కాదు, ప్రజల జీవన విధానంలో కూడా ఒడిదుడుకులు ఎదురవుతుంటాయి. ముఖ్యంగా చమురు సంక్షోభం సంభవిస్తే అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధర ఒక్కసారిగా పెరిగిపోతుంది. మనకు ఎఉ క్కవగా చమురును, గ్యాస్‌ను సరఫరా చేసేది రష్యా, ఇరాన్ దేశాలే. ఆయా దేశాల నుంచి సరఫరాకు ఆటంకాలు ఏర్పడితే మన దేశం భారీగా అంతర్జాతీయ మార్కెట్‌కు మూల్యం చెల్లించుకోవలసి వస్తుంది. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది ఫిబ్రవరిలో రష్యా నుంచి మనదేశానికి ముడి చమురు దిగుమతులు రోజువారీ సరాసరిన (మిలియన్ పెర్ డే) 1.41 మిలియన్ బ్యారెళ్ల వంతున తగ్గిపోవడం ఆందోళన కలిగించే అంశం. గత సంవత్సరం జనవరి నాటికి రోజువారీ 1.49 మిలియన్ బ్యారెళ్ల వంతున తగ్గిపోగా అంతకన్నా ఇప్పుడు తగ్గడం గమనార్హం. కార్గో ట్రాకింగ్ ఏజెన్సీ వోర్టెక్స్ వివరాల ప్రకారం ఈ ఏడాది ఫిబ్రవరిలో రోజువారీ మొత్తం 4.77 మిలియన్ బ్యారెళ్లుగా చమురు దిగుమతులు జరిగాయి. జనవరిలో రోజువారీ మొత్తం 4.76 మిలియన్ బ్యారెళ్ల చమురు దిగుమతులు కాగా పెద్దగా మార్పు లేదు. అయితే ఈ మార్చి, ఏప్రిల్ నెలల్లో మరింతగా చమురు దిగుమతులు క్షీణిస్తాయని వోర్టెక్స్ చెబుతోంది. దీనికి కారణం అమెరికా ఆఫీస్ ఆఫ్ ఫారెస్ అసెట్స్ కంట్రోల్ (ఒఎఫ్‌ఎసి) జనవరి 10 న విధించిన ఆంక్షలే. అయితే ఈ లోటును పశ్చిమాసియా దేశాలు భర్తీ చేస్తాయని ఎపిఎసి అనాలిసిస్ వోర్టెక్స్ అధినేత ఇవాన్ మేథ్యూ వెల్లడించారు. రష్యా చమురు ఉత్పత్తిదారులైన గాజ్‌ప్రోమ్ నెఫ్ట్, సర్గుట్ నెఫ్ట్ గ్యాస్‌లతో పాటు దాదాపు 180 ట్యాంకర్లపై తాజాగా జనవరి 10న అమెరికా ఆంక్షలు విధించింది. రష్యాకు రెవెన్యూ రాకుండా అడ్డుకోవడమే దీని వెనుక ఉన్న ఆంతర్యం. ఉక్రెయిన్‌పై యుద్ధం సాగించడానికే రష్యా ఈ ఆదాయాన్ని ఖర్చు పెడుతోందని అమెరికా ఆరోపిస్తోంది. ఫలితంగానే రష్యా చమురు కార్గో నౌకలు ఫిబ్రవరి 27 నాటికి అమెరికా ఆంక్షల సుడిలో చిక్కుకోవలసి వచ్చింది. 2024 మొదటి ఏడు మాసాలు (జనవరి జులై) ఇజ్రాయెల్, జోర్డాన్, లెబనాన్ దేశాలకు భారత్ నుంచి వాణిజ్యంలో సంఘర్షణలు తప్పలేదు. భారత్ నుంచి ఇజ్రాయెల్‌కు 63.3 శాతం వరకు ఎగుమతులు పతనమయ్యాయి. దీని విలువ 1.3 బిలియన్ డాలర్లు. ఆర్గానిక్ కెమికల్స్, పెట్రోలియం ఉత్పత్తులు, డైమండ్స్, ఎగుమతులకు గండి పడిందని వాణిజ్య విభాగం వెల్లడించింది. అలాగే జోర్డాన్‌కు ఎగుమతుల్లో 38 శాతం అంటే 638 మిలియన్ డాలర్ల వరకు, లెబనాన్‌కు 7% అంటే 198 మిలియన్ డాలర్ల వరకు ఎగుమతులు పతనమై భారత్‌కు నష్టాలు సంభవించాయి. 2024 వరకు అంతకు ముందు ఏడేళ్లుగా ఏటా 3% వంతున ముడిచమురు ఉత్పత్తిలో తగ్గుదల కనిపిస్తోంది. ఉత్పత్తిలో తగ్గుదల ఉంటున్నా వినియోగం పెరుగుతుండడంతో భారత్ దిగుమతులపై ఎక్కువగా ఆధారపడవలసి వస్తోంది. 2017 నుంచి 2024 వరకు 86 నుంచి 89 శాతం వరకు దిగుమతులపైనే దేశం ఆధారపడవలసి వచ్చింది. భారత ఇంధన వినియోగ చిత్ర 2024 ఆర్థిక సంవత్సర నివేదికలో ఇదో భాగం. దేశం ఇంధనాన్ని సేకరించడం, ఉత్పత్తి, వినియోగం తాలూకు ఆమూలాగ్ర డేటాను ఈ నివేదిక అందిస్తోంది. కేంద్ర ఇంధన మంత్రిత్వశాఖ నేతృత్వంలో బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బిఇఇ)ఈ నివేదికను రూపొందించింది.

2024 ఆర్థిక సంవత్సరంలో మొత్తం సరఫరా అయిన ఇంధనం 910 మిలియన్ టన్నులు కాగా, ఇందులో బొగ్గు నుంచి 60%, చమురు నుంచి 28%, గ్యాస్ నుంచి 7%, శిలాజేతర వనరుల నుంచి 5% సరఫరా అయింది. స్వదేశీ చమురు ఉత్పత్తి 2017 ఆర్థిక సంవత్సరంలో 36 మిలియన్ టన్నులు కాగా, 2024 నాటికి 29.4 మిలియన్ టన్నులకు తగ్గిపోయింది. వార్షిక రేటు 3% వరకు తగ్గుతూ వస్తోంది. ఈ తగ్గుదలకు అనేక కారణాలు దోహదం చేస్తున్నాయి. ఈ కొరతను అధిగమించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు 2019లో హైడ్రోకార్బన్ ఎక్స్‌ప్లొరేషన్ అండ్ లైసెన్సింగ్ (హెచ్‌ఇఎల్‌పి) వంటి ప్రక్రియను అమలుచేసే చర్యలను తీసుకుంది. ఎంపికైన చమురు క్షేత్రాల్లో తగిన సాంకేతిక విధానాలు అమలు చేసి చమురు ఉత్పత్తిని సాధించడమే ఈ విధానం లక్షం. చిన్న, మధ్యతరహా స్థాయిలో చమురు పరిశోధనలను కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ద్వారా ఆయా సంస్థలను ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వ నిర్వహణలోని ఒఎన్‌జిసి, ఆయిల్ ఇండియా సంస్థలు క్రమంగా 65 శాతం, 11 శాతం వరకు 20232024 సంవత్సరంలో చమురును అందించగలిగాయి. మిగతా 24 శాతం ముడిచమురు ఉత్పత్తి ప్రొడక్షన్ షేరింగ్ కాంట్రాక్ట్ (పిఎస్‌సి) లేదా రెవెన్యూ షేరింగ్ కాంట్రాక్ట్ (ఆర్‌ఎస్‌సి) ద్వారా లభించింది. 2024 ఏప్రిల్ 1 నాటికి సమతుల్యతలో తిరిగి పొందగలిగిన చమురు నిల్వలు 671.4 మిలియన్ టన్నులుగా భారత్ అంచనా వేసింది. అంతకు ముందు సంవత్సరం నాటి 669.47 మిలియన్ టన్నుల నిల్వలతో పోల్చుకుంటే 0.3 శాతం ఎక్కువ. స్వదేశీ చమురు ఉత్పత్తి కన్నా డిమాండ్ ఎక్కువగా ఉండడంతో చమురు దిగుమతులపై ఆధారపడడం మరింత ఎక్కువ అవుతుందని ఫిచ్ రేటింగ్స్ అంచనా వేస్తోంది.

ప్రపంచంలోనే మూడో అతి పెద్ద చమురు దిగుమతి దారైన భారత్ 2024లో 234 మిలియన్ టన్నుల చమురును సేకరించుకోగలిగింది. సరఫరా కావలసి చమురులో 86% 2017లోను, 89% 2024 లోనూ దిగుమతి చేసుకోవలసి వచ్చింది. కొవిడ్ మహమ్మారి సమయంలో చమురు దిగుమతులు తాత్కాలికంగా 202122 లో తగ్గాయి. భారీ స్థాయిలో దిగుమతి చేసుకున్నామంటే రిఫైన్డ్ పెట్రోలియం ఉత్పత్తుల వినియోగం భారీగా పెరుగుతున్నట్టే భావించక తప్పదు. 2024 ఏప్రిల్ 1నాటికి ఏడాదికి 256.8 మిలియన్ టన్నుల చమురును రిఫైనింగ్ చేసే సామర్థ్యం భారత్‌కు ఉందని తేలింది. దీంతో ప్రపంచంలో అమెరికా, చైనా, రష్యా తరువాత నాలుగో రిఫైనర్‌గా భారత్ నిలుస్తోంది.

# యువతకు స్ఫూర్తి భగత్ సింగ్

భగత్ సింగ్ (1907 సెప్టెంబరు 28–1931 మార్చి 23) భారత స్వాతంత్ర్య సమరయోధుడు, కరుడుకట్టిన ఉద్యమకారుడు. ఢిల్లీ వీధిలో ఎర్ర కాగితాలు చల్లి ప్రజలను చైతన్య పరిచాడు. విప్లవం వర్ధిల్లాలి అనే నినాదాన్ని ఇచ్చింది కూడా భగత్ సింగే. భారత స్వాతంత్ర్యోద్యమము లో పోరాడిన అత్యంత ప్రభావశీల విప్లవ కారులలో ఆయన ఒకడు. ఆ కారణంగానే షహీద్ భగత్ సింగ్‌గా నేటికీ కొనియాడ బడుతున్నాడు. భగత్ సింగ్ పూర్వపు పంజాబ్‌లో, ప్రస్తుత పాకిస్తాన్‌లో ఉన్న లాయల్ జిల్లా బంగా సమీపంలోని ఖత్కర్ కలాన్ గ్రామంలోని సంధు ఝాట్ కుటుంబంలో సర్దార్ కిషన్ సింగ్, విద్యావతి దంపతులకు జన్మించాడు. భగత్ అనే పదానికి "భక్తుడు" అని అర్థం. భగత్ సింగ్ మూడేళ్ళ పిల్లాడిగా ఉన్నప్పుడు తండ్రి కిషన్ సింగ్, భగత్ సింగ్‌ను చంకకెత్తుకొని, కొత్తగా వేస్తున్న తోటను చూడ్డానికి పొలాల్లోకి వెళ్ళాడు. వెంటనే కిందికిదిగిన భగత్‌సింగ్ ఆ మట్టిలో ఆడుకుంటూనే చిన్నచిన్న గడ్డిపరకలను నాటడం మొదలు పెట్టాడు. తండ్రి "ఏం చేస్తున్నావ్ నాన్నా" అని ప్రశ్నిస్తే, భగత్ సింగ్ "తుపాకులు నాటుతున్నా" అని బదులిచ్చాడు. భవిష్యత్తుకు బాల్యం మొలకలు వేసే వయస్సులో తుపాకులను మొలకెత్తించాలని చూడడం ఆయన వ్యక్తిత్వానికి మచ్చుతునక. 13 ఏళ్ల ప్రాయంలోనే మహాత్మా గాంధీ సహాయ నిరాకరణో ద్యమానికి సింగ్ ప్రభావితుడ య్యాడు. ఆ సమయంలో బ్రిటీష్ ప్రభుత్వానికి ఎదురుతిరిగిన భగత్ ప్రభుత్వ పాఠశాల పుస్తకాలు, బ్రిటీషు దిగుమతి దుస్తులను తగులబెట్టడం ద్వారా గాంధీ సిద్ధాంతాలను అనుసరించాడు. లాలాలజ్‌పత్ రాయ్ మరణం, సాండర్స్ హత్యల తరువాత 1928లో భారత్‌లోని వర్ధమాన రాజకీయ పరిస్థితిపై నివేదికను కోరుతూ సర్ జాన్ సైమన్ నేతృత్వంలో బ్రిటీష్ ప్రభుత్వం ఒక కమిషన్‌ను ఏర్పాటుచేసింది. భారత దేశానికి వచ్చిన సైమన్ కమిషన్లో ఒక్క భారతీయుడైనా లేనందుకు నిరసనగా, ఉద్యమంలో లాల్‌జీ కీలక పాత్ర వహించి, సైమన్ కమిషన్‌ను బహిష్కరించాలి అంటూ పంజాబ్ అసెంబ్లీలో ఆయన తీర్మానం పెట్టి గెలిపిం చారు. ఇది ప్రభుత్వానికి కంటగిం పుగా మారింది. అక్టోబర్ 30, 1928న ఆ కమిషన్ లాహోర్ రాగా, లాల్‌జీ కూడా అహింసతో, మౌనంగా సైమన్ వ్యతిరేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మౌనంగా ఉద్యమి స్తున్న వారిపైన కూడా లాఠీ చార్జికి ఆదేశించాడు పోలీసు సూపరింటెం డెంట్



జేమ్స్ ఏ స్కాట్. తను స్వయంగా లాల్‌జీ మీద దాడి చేసి, లాల్‌జీ ఛాతీ మీద లాఠీ తో స్కాట్ తీవ్రంగా కొట్టాడు. ఆ దెబ్బలతోనే లాల్‌జీ నవంబర్ 17న చని పోయారు. ఈ సంఘటనను కళ్లారా చూసిన భగత్ సింగ్ ప్రతీకారం తీర్చు కోవాలని నిర్ణయించు కున్నాడు. పోలీసు అధికారి స్కాట్‌ను హత మార్చడానికి విప్లవకారులు శివరామ్ రాజ్‌గురు, జై గోపాల్, సుఖ్‌దేవ్ థాపర్‌లతో ఆయన చేతులు కలిపాడు. డీఎస్పీ జే. పీ. సాండర్స్ కనిపించినప్పుడు పొర పాటుగా స్కాట్ అనుకుని, జైగో పాల్ ఆయన్ను కాల్చమంటూ సింగ్‌కు సంకేతాలిచ్చాడు. ఫలితం గా స్కాట్‌కు బదులు సాండర్స్ హతమయ్యాడు.

ఫిరోజ్ పూర్లో బ్రిటిష్ పోలీసు అధికారి జె.పి.సాండర్స్ ను హత మార్చి నందుకు గాను వారికి 1930లో అక్టోబర్ 7వ తేదీని ఈ మరణ శిక్షను ఖరారు చేశారు. భగత్ సింగ్ సహా ముగ్గురికి ఉరిశిక్ష ఖరారు చేసిన తీర్పు వివరాలను 2015లో ప్రచురించారు. Warrant of Execution On Sentence Of Death అనే విడుదల చేసిన పత్రంలో 1930 అక్టోబర్ 7వ తేదీన ఉరిశిక్ష విధిస్తూ తీర్పిచ్చినట్లు స్పష్టంగా ఉంది. 1931, మార్చి 23న ఉరిశిక్ష అమలు చేసినట్లు మరో పత్రంలో వివరాలు ఉన్నాయి. జైలు సూపరింటెండెంట్ సంతకం చేసిన పేపర్‌ను టైమ్స్ ఫ్యాక్ట్ చెక్ గుర్తించి బహిర్గతం చేసి, లాహోర్ లోని పంజాబ్ శాఖలో ఈ పత్రాలను ఇటీవల ప్రదర్శనకు ఉంచారు. 1930 అక్టోబర్ 7 న న్యాయస్థానము తీర్పును వెలువరించింది. తీర్పు 281 పేజీల్లో ఇవ్వబడింది. విచారణ ఎదుర్కొన్న వారందరికీ ఇలా శిక్షలు ఇవ్వబడ్డాయి. ఉరిశిక్ష: 1.భగత్ సింహ 2. సుఖఃదేవ్ 3. రాజగురులకుబీ అలాగే ఆజన్మాంతర జీవిత ఖైదు: 1.కిశోరీలాల్ 2. మహవీర్ సింహ (అండమాన్లో 9 రోజులు నిరాహార దీక్ష చేసి అమరుడయ్యాడు. 3. విజయ్ కుమార్ సింహ 4. శివవర్మ 5. గయా ప్రసాద్ 6. జయదేవ్ కపూర్ 7. కమల్నాథ్ తివారిలకుబీ అలాగే జీవిత ఖైదు: 1.కుందాన్లాల్ ( 7 సంవత్సరాలు) 2. ప్రేమదత్ ( 5 సంవత్సరాలు)లకుబీ అలాగే అజయ్ ఘోష్, సురేంద్రనాథ్ పాండియ ఇంకా జితేంద్రనాథ్ సన్యాల్‌లను విడిచిపెట్టారు. విచారణలో ఉన్నవారందరూ కోర్టులను బహిష్కరించడం వలన తీర్పును లాహోర్ లోని సెంట్రల్ జైలు లో వినిపించారు. తమను యుద్ధ ఖైదీలుగా గుర్తించడం ద్వారా ఉరి తీయ కుండా కాల్పుల బృందం చేత హతమార్చాలని జైలులో ఉన్నప్పుడు భగత్ సింగ్, మరో ఇద్దరు వైస్రాయికి లేఖ రాశారు. క్షమాభిక్ష ముసాయిదా లేఖపై సంతంకం కోసం భగత్ సింగ్ మిత్రుడు ప్రన్నత్ మెహతా ఆయన్ను

ఉరితీయడానికి నాలుగు రోజుల ముందు మార్చి 20న జైలులో కలిశాడు. అయితే సంతకం చేయడానికి సింగ్ నిరాకరించాడు. మార్చి 23న ఉరితీసినట్లు జైలు అధికారులు మరణ ధ్రువీకరణ పత్రాన్ని విడుదల చేశారు. అప్పటి సూపరింటిండెంట్ ఆఫ్ పోలీస్ వి.ఎన్. స్మిత్ ప్రకారం, భగత్ సింగ్‌ను ముందుగానే ఉరితీశారు. సాధారణంగా ఉదయం 8 గంటలకు ఉరితీసేవారు. అయితే ఏమి జరిగిందో ప్రజలు తెలుసుకునే లోగానే ఆయన్ను ఉరితీయాలని నిర్ణయించుకుని..సుమారు రాత్రి 7 గంటల ప్రాంతంలో ఉరి తీశారు. భగత్ సింగ్ వీర మరణం వృథా కాలేదు, ఎందరో యువకులను భారత స్వాతంత్ర్యోద్యమము వైపుకు మరల్చింది. భగత్ సింగ్ మరణం భారత స్వాతంత్ర్యోద్యమ కొనసాగింపుకు సాయపడేలా వేలాది మంది యువకుల్లో స్ఫూర్తిని నింపింది. ఆయన ఉరి అనంతరం ఉత్తర భారతాన పలు ప్రాంతాల్లో బ్రిటీష్ ప్రభుత్వమునకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు వెల్లువెత్తాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల...

# నైతిక స్థైర్యాన్ని దెబ్బతీస్తున్న ప్రభుత్వ విధానాలు


తను చెప్పిన మాటలకు విరుద్ధంగా మోడీ ప్రభుత్వం నడుచుకుంటోంది. ప్రభుత్వ రంగ బ్యాంకులు స్వయంప్రతిపత్తి సంస్థలని, వాటి రోజువారీ పనిలో తాము జోక్యం చేసుకోబోమని ఇటీవల ప్రధాని చెప్పారు. మరోపక్క కేంద్ర ఆర్థిక శాఖ తాను ఆమోదించిన బ్యాంకు యాజమాన్య, ఉద్యోగ సంఘాల మధ్య జరిగిన ద్వైపాక్షిక ఒప్పందాలను తానే బేఖాతరు చేస్తోంది. వేతనాలు, అలవెన్సులు, ఇతర సౌకర్యాలకు అదనంగా బ్యాంకులకు వచ్చే లాభాలను బట్టి అందరికీ ప్రోత్సాహకాలు ఇవ్వాలనేది ఒప్పందం. దీనికి విరుద్ధంగా కేవలం 3 శాతంగా ఉండే పైస్థాయి అధికారులకు మాత్రమే ప్రోత్సాహకాలను ఇవ్వాలని ఆర్థికశాఖ నోటిఫికేషన్ ఇచ్చింది. ప్రభుత్వ రంగం బ్యాంకుల్లో సిబ్బంది తగ్గిపోయి పని చేస్తున్న ఉద్యోగులపై ఆ భారం పడుతోంది. ఉద్యోగులు పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఖాతాదారుల సేవలపై దుష్ప్రభావం పడుతోంది. బ్యాంకుల విలీనాలు, శాఖల మూసివేత పర్యవసానంగా సిబ్బంది సంఖ్య తగ్గడమేగాక ఒత్తిడిని తట్టుకోలేక ఉద్యోగాలను వదిలిపెట్టిపోయే వారి సంఖ్య కూడా పెరిగింది. 2012–13లో మొత్తం ఉద్యోగుల సంఖ్య 8,01,659 కాగా 2023–24 నాటికి అది 7,46,679కి తగ్గిపోయింది. అంటే 54,980 మంది ఉద్యోగులు తగ్గారు. బ్యాంకులు నిర్వహించే వ్యాపార లావాదేవీల మొత్తం మాత్రం ఇదే కాలంలో రూ.102 లక్షల కోట్ల నుండి రూ.224 లక్షల కోట్లకు పెరిగింది. ఒక్కో ఉద్యోగి టర్నోవర్ రూ.12 కోట్ల నుండి రెండున్నర రెట్లు పెరిగి రూ.30 కోట్లకు చేరింది. మరోపక్క బ్యాంకుల్లో ఉద్యోగాలకోసం లక్షలాదిమంది నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. పెరుగుతున్న వ్యాపారానికి తగిన విధంగా సిబ్బంది నియామకాలు జరగడం లేదు. మరోపక్క ప్రైవేటు బ్యాంకుల్లో 2012–13లో 2,69,941 మంది ఉద్యోగులు ఉండగా వారి సంఖ్య 2023–24లో 8,46,530కి పెరిగింది. ప్రైవేటు రంగంలో ప్రతీ ఉద్యోగి టర్నోవరు రూ.11 కోట్ల నుండి రూ.16 కోట్లకు మాత్రమే పెరిగింది. ప్రైవేటు రంగ బ్యాంకులతో పోల్చుకుంటే ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో సిబ్బంది సంఖ్య గణనీయంగా పెరగాల్సి వుండగా దానికి బదులు తగ్గిపోయింది! మామూలు వ్యాపారానికి తోడుగా కేంద్ర ప్రభుత్వ పథకాలైన అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి జీవన్ బీమా యోజన వంటి అనేక పథకాలను ప్రభుత్వ రంగ బ్యాంకులు నిర్వహిస్తున్నాయి. ప్రైవేటు రంగ బ్యాంకులకు ఈ పని ఉండదు. ప్రభుత్వ రంగ బ్యాంకులు 2023–24లో అత్యధికంగా నికర లాభం ఒక లక్షా 41 వేల కోట్లు ఆర్జించాయి. 2024–25 అర్ధ సంవత్సరంలోనే రూ.85,520 కోట్ల నికర లాభం ఆర్జించాయి. మోడీ ప్రభుత్వానికి బ్యాంకుల లాభాలలో తన వంతు వాటాగా డివిడెండ్‌ను కాజేయడం మీద ఉన్న శ్రద్ధ వ్యాపారానికి తగినంత సిబ్బందిని నియమించడంలో కాని, ఖాతాదారుల సేవలను మెరుగుపరచడంలో కాని లేదు. కేంద్ర ప్రభుత్వ విధానాల వలన ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో పర్మనెంట్ పనులను ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో చేయిస్తున్నారు. కొన్ని కీలకమైన పనుల్లో కూడా వీరిని నియమించడం బ్యాంకుల రక్షణకు ప్రమాదమే కాక, వీరి ఉద్యోగాలకు రక్షణ లేనందున వారి పనిలో నాణ్యత కూడా తగ్గుతుంది. వీరందరినీ పర్మనెంట్ చేయాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. ఇతర కార్మిక, ఉద్యోగ వర్గాల మాదిరిగానే బ్యాంక్ ఉద్యోగులు కూడా పెన్షన్ సంస్కరణల దుష్ఫలితాలను ఎదుర్కొంటున్నారు. 2010 ఏప్రిల్ ఒకటవ తేదీ, ఆ తర్వాత చేరిన ఉద్యోగులకు, అధికారులకు 1995, 1996 పెన్షన్ విధానాన్ని వర్తింపజేయడం లేదు. వీరికి నిర్ధారణగా ఇంత పెన్షన్ వస్తుందని లేదు. కొత్త పెన్షన్ స్కీమును అమలు చేస్తున్నారు. పెన్షన్ లేదా ఆదాయం కోసం చెల్లింపులు చేయడం మినహా ఇంత పెన్షన్ లేదా ఆదాయం వస్తుందన్న గ్యారంటీ లేదు. వీరికి 1995, 1996 పెన్షన్ రెగ్యులేషన్లను వర్తింపజేయాలి. 1995, 1996 పెన్షన్ రెగ్యులేషన్లు అమలవుతున్న బ్యాంకు ఉద్యోగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పెన్షన్ అప్‌డేషన్ లేదు. తాజాగా జరిగిన ఒప్పందం వరకూ పెన్షన్‌ను అప్‌డేట్ చేయాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. సెంట్రల్ సివిల్ సర్వీసెస్ పెన్షన్ రూల్స్ వర్తించే ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం గ్రాట్యుటీని రూ. 25 లక్షల వరకు పెంచి పూర్తిగా ఆదాయ పన్ను నుండి మినహాయించింది. బ్యాంకు ఉద్యోగులకు, ఇతరులకు కూడా గ్రాట్యుటీ చెల్లింపు (సవరణ) చట్టం–2018ని వర్తింపజేసి గ్రాట్యుటీని రూ.25 లక్షలకు పెంచి, పూర్తి మొత్తాన్ని ఆదాయ పన్ను నుంచి మినహాయించాలి. కేంద్ర ప్రభుత్వం తన ఉద్యోగులపైన, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులపైన సామర్థ్యం పేరుతో పదే పదే దాడి చేస్తోంది. ముందస్తుగా పదవీ విరమణ చేయించే ప్రయత్నం చేస్తోంది. ఈ సారి వంతు ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులది. 55, 57, 58 సంవత్సరాల వయస్సుకు చేరుకున్న అందరు ఉద్యోగుల, అధికారుల సామర్థ్యాన్ని ప్రతీ నెలా పరీక్షించి తమకు నివేదికలు పంపాలని 2024 సెప్టెంబర్ 26న కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ అన్ని బ్యాంకులకు ఆదేశాలు పంపింది. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం అంకిత భావంతో పని చేస్తున్న ఉద్యోగుల, అధికారుల నైతిక స్థైర్యాన్ని దెబ్బ తీస్తుంది. ఉద్యోగ భద్రత ప్రమాదంలో పడుతుంది. ఒప్పందాల ద్వారా పని కోసం నిర్దేశించిన నిబంధనలు ఉండగా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవడం ప్రభుత్వ రంగ బ్యాంకుల స్వయంప్రతిపత్తికి హానికరంగా మారుతుంది. ఆ ఆదేశాలను వెంటనే ఉపసంహరించుకోవాలి. అమలులో ఉన్న బ్యాంక్ చట్టాల ప్రకారం, ఉద్యోగుల నుండి ఒకరిని, అధికారుల నుండి ఒకరిని ప్రభుత్వ రంగ బ్యాంకుల బోర్డులలో డైరెక్టర్లుగా నియమించాలి. గత పది సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం యూనియన్లు పంపిన ప్యానెళ్ల నుండి డైరెక్టర్ల నియామకాలు చేయడం లేదు. చట్టాన్ని అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వమే ఉల్లంఘిస్తోంది. ఒక్క ఇండిస్టియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నుంచే కాకుండా ప్రతీ ప్రభుత్వ రంగ బ్యాంక్‌లో ప్రభుత్వ వాటాను మైనారిటీ స్థాయికి దిగజార్చేందుకు మోడీ ప్రభుత్వం ఒక్కొక్కటిగా చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా బ్యాంకులను విలీనం చేసి ప్రభుత్వ రంగ బ్యాంకుల సంఖ్యను 12కు తగ్గించింది. బ్యాంకింగ్ వంటి వ్యూహాత్మక రంగాలలో కూడా ప్రభుత్వ రంగంలో ఒక్క బ్యాంక్‌ను మాత్రమే ఉంచి తక్కిన బ్యాంకులన్నింటినీ ప్రైవేటీకరించడం మోడీ ప్రభుత్వ విధానం. ఆ ఒక్క బ్యాంకులో కూడా ప్రభుత్వానికి మైనారిటీ వాటాయే ఉంటుంది. ఈ విధానంలో భాగంగానే ప్రభుత్వ రంగ బ్యాంకులను బలహీనపరిచే ప్రయత్నం చేస్తోంది. కొన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులు నిర్దేశిత కాలానికి మాత్రమే (ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లారుమెంట్) ఉద్యోగులను నియమిస్తున్నాయి. బ్యాంక్ ఉద్యోగుల మాదిరిగానే ఇతర రంగాలలోని ఉద్యోగులు, కార్మికులు కూడా అవే సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఖాళీల భర్తీ, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయకపోవడం, కొత్త పెన్షన్ స్కీమునే రద్దు చేయకుండా కొనసాగించడం, ప్రైవేటీకరణ ప్రయత్నాలు, ముందస్తుగా పదవీ విరమణ చేయించే ప్రయత్నాలు ముమ్మరం చేయడం, ఒప్పందాలను, చట్టాలను ప్రభుత్వమే ఉల్లంఘించడం తదితర సమస్యల పరిష్కారం కోసం ఇతర రంగాలలోని ఉద్యోగులు కూడా పోరాటాలలోకి వస్తున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులు ఆ ప్లాంట్ రక్షణ కోసం, ఉద్యోగుల తొలగింపును ఆపడం కోసం, సుదీర్ఘ కాలంగా పోరాటంలో ఉన్నారు. విద్యుత్ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆ రంగ ఉద్యోగులు, ఇంజనీర్లు జాతీయ స్థాయిలో జూన్ 26న సమ్మె చేయాలని వారి సంఘాల సమన్వయ కమిటీ పిలుపునిచ్చింది. బ్యాంక్ ఉద్యోగులు, అధికారులు, ఐక్యంగా సమ్మె చేయడం తక్కిన రంగాలకు ఆదర్శప్రాయం. వివిధ రంగాలలో జరుగుతున్న పోరాటాలు మొత్తం అందరి ఐక్య పోరాటాలకు దారి తీయాలి. లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతూ కార్మిక ఉద్యోగ సంఘాల సమ్మె మే 20న జాతీయ స్థాయిలో జరగనుంది. అలాంటి పోరాటాలలో కూడా బ్యాంక్ ఉద్యోగులు, అధికారులు భాగస్వాములు కావాలి.

# మానవ సేవలో శాస్త్ర సాంకేతిక పాత్ర

నేడు ప్రపంచవ్యాప్తంగా 75వ 'ప్రపంచ వాతావరణ శాస్త్ర సంస్థ' అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించుకుంటున్న వేళ 2025 ఏడాదిని "ముందస్తు హెచ్చరికల వాతావరణశాస్త్ర సాంకేతికతలో గ్యాప్‌లను తగ్గించడం" అనే ఇతివృత్తం తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నాయి. తీవ్రమైన ప్రమాదకర వాతావరణ పరిస్థితులు ముందస్తు తెలుసుకోవడం వల్ల జరగనున్న ఆస్తి ప్రాణ నష్టాలను తగ్గించడానికి మానవాళికి సరైన సమయం దొరకడం, నష్ట నివారణ చర్యలు తీసుకోవడం జరుగుతూ వస్తున్నది. వాతావరణ హెచ్చరికల రంగంలో వస్తున్న నూతన విప్లవాత్మక మార్పులను స్వాగతిస్తూ, మరింత ముందంజ వేయడానికి ప్రతి ఏట 23 మార్చిన "ప్రపంచ వాతావరణ శాస్త్ర దినోత్సవం" లేదా "వరల్డ్ మెటీరియొలాజికల్ డే" నిర్వహించడం ఆనవాయితీగా మారింది. హరికేన్లు, అకాల వర్షాలు, కరువుకాటకాలు, మండుటెండలు, తుఫాన్లు, తీవ్రమైన గాలుల లాంటి వాతావరణ ప్రతికూల పరిస్థితులను ముందుగానే ఖచ్చితమైన అంచనాలతో పసిగట్టడంతో పాటు ఆయా ప్రాంతాల ప్రభుత్వాలు, ప్రజలను ముందస్తు హెచ్చరించడం నిరంతరం కొనసాగడానికి నవ్య వాతావరణ శాస్త్ర సాంకేతికతలు, ఏఐ టెక్నాలజీలను వినియోగించడం నేటి మానవాళికి వరంగా మారింది. గతంలో రేడియో లేదా ప్రభుత్వ యంత్రాంగాల ద్వారా వాతావరణ ప్రతికూలాల హెచ్చరికలు జరుగుతూ ఉండేవి. నేటి డిజిటల్ యుగంలో క్షణాల్లో హెచ్చరికల వార్తలు ప్రజల ముంగిట్లో ప్రత్యక్షం కావడంతో నష్ట నివారణ విజయవంతంగా జరుగుతున్నది. 2025 ప్రపంచ వాతావరణ శాస్త్ర దినోత్సవం ఇతివృత్తంగా "అన్ని కాలాలకు, అన్ని వర్గాల ప్రజలకు కొలతలు" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నది. 'మీటర్ కన్వెన్షన్' ఏర్పడి నేడు 150వ వార్షికోత్సవం జరుపుకుంటున్న వేళ ఈ ఇతివృత్తం అధిక ప్రాధాన్యతను సంచరించుకున్నది. నేడు పర్యావరణ కాలుష్యం కోరలు చాస్తున్న వేళ అకాల వర్ష వడగళ్లు, తీవ్రమైన రువుకాటకాలు, ఆకస్మిక పెను తుఫాన్లు మంచు వర్షాలు, అడవుల్లో కార్చిచ్చులు, అపరిమిత ఉష్ణోగ్రతలు లాంటి వాతావరణ మార్పులను ముందుగానే పసిగట్టి ప్రజలను చైతన్య పరచడం జరుగుతోంది. ప్రజల ప్రాణాలు కాపాడడం, జీవనోపాధులను పరిరక్షించడం, పౌరసమాజాన్ని అన్ని వేళ్ల జాగరూకతతో ఉంచడం, అత్యవసర సేవలను సిద్ధం చేయడం, విపత్తు నివారణ విభాగాలను సర్వ వేళల్లో సిద్ధంగా ఉంచడంలో ముందస్తు వాతావరణ హెచ్చరికలు తోడ్పడుతున్నాయి. నేటి ప్రపంచ దేశాల్లో దాదాపు 108 దేశాలు ఆధునిక వాతావరణ శాస్త్ర సాంకేతికతలను వినియోగిస్తున్నప్పటికీ అల్పాదాయ దేశాల్లో నేటికీ పరిస్థితులు భిన్నంగానే ఉన్నాయి. గత కొన్ని ఏళ్లలో దాదాపు 39 శాతం వరకు ముందస్తు హెచ్చరికల వ్యవస్థల్లో అభివృద్ధి సాధించడం గమనార్హం. నేటి విపరీత పరిస్థితుల్లో వాతావరణ ప్రతికూల మార్పులు, తీవ్రమైన వాతావరణ ప్రతిచర్యలకు సమాధానంగా ప్రపంచ దేశాలు ప్రభుత్వాలు, వాతావరణ శాస్త్ర అత్యాధునిక పరిశోధనా సంస్థలు, వాతావరణ శాస్త్ర విభాగాలను పదును పెట్టాల్సిన సమయం ఆసన్నమైందని తెలుసుకోవాలి. వాతావరణ ప్రతికూల మార్పుల వెనుక దాగి ఉన్న కారణాలతో పాటు వాటిని ప్రతిఘటించడం, ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండడం, కనిష్ట నష్టాలను నమోదు చేసుకోవడం లాంటి అంశాలకు అవగాహన పర్చుకోవడానికి ప్రతి ఒక్కరు ప్రాధాన్యం ఇవ్వాలి. వాతావరణ విధ్వంసాలను అరికట్టడానికి కార్బన్ ఉద్గారకాలను తగ్గించడం, మొక్కలు నాటడం, పర్యావరణ హిత పాలసీల అమలు, పర్యావరణ పరిరక్షణ ప్రయత్నాలు, అవగాహనలు కొనసాగుతూనే ఉండాలి. ప్రభుత్వ వాతావరణ శాస్త్ర విభాగం ద్వారా వాతావరణ హెచ్చరికలు, తుఫాన్ల ముందస్తు అంచనాలు, విపత్తు నివారణ వ్యవస్థల నిర్వహణలు, భూకంపాల తీవ్రత హెచ్చరికలు, పరిశోధనల్లో ముందడుగులు, సమాచార గణాంకాల విశ్లేషణలు, సముద్ర వైమానిక తోడ్పాట్లు, ప్రజా చైతన్యాలు నిరంతరం జరిగితేనే ప్రపంచ మానవాళి సురక్ష జరుగుతుందని తెలుసుకుందాం.

# వాతావరణ మార్పుల గురించి ప్రజలకు అవగాహన అవసరం

ప్రతి సంవత్సరం మార్చి 23వ తేదీన ప్రపంచ వాతావరణ శాస్త్ర దినోత్సవం జరుపుకుంటారు. ఈ దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపుకోవడానికి ముఖ్య ఉద్దేశం... వాతావరణ శాస్త్రానికి ఉన్న ప్రాముఖ్యతను తెలియజేయడం, వాతావరణ మార్పుల ప్రభావం గురించి ప్రజల్లో అవగాహన పెంచడం. 1950 మార్చి 23న ప్రపంచ వాతావరణ సంస్థ స్థాపించ బడింది. ఈ సంస్థ స్థాపన దినాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం ఈ తేదీన ప్రపంచ వాతావరణ శాస్త్ర దినోత్సవాన్ని నిర్వహించడం




ప్రారంభమైంది. 1951లో ఈ సంస్థ ఐక్యరాజ్య సమితి ప్రత్యేక సంస్థగా గుర్తింపు పొందింది. ఈ దినోత్సవం ద్వారా వాతావరణ పరిస్థితులు, వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలు వంటి అంశాలపై ప్రజలకు చైతన్యం కలిగించడమే ముఖ్య ఉద్దేశం. సమాజం భద్రత, ప్రజల శ్రేయస్సు కోసం వాతావరణ శాఖలు అందిస్తున్న సేవలను గుర్తు చేస్తుంది. ప్రతి సంవత్సరం ఈ దినోత్సవానికి ఒక ప్రత్యేక థీమ్‌ను ప్రకటిస్తుంది. ఈ థీమ్ ఆధారంగా...వాతావరణ అవగాహన కార్యక్రమాలు, శాస్త్రీయ సమావేశాలు, విద్యార్థులకు పోటీలు, ప్రచార ర్యాలీలు నిర్వహిస్తారు. ఈ థీమ్‌లు వాతావరణ మార్పులు, ప్రకృతి విపత్తుల నివారణ, శాస్త్రీయ పరిజ్ఞాన ప్రాముఖ్యత వంటి అంశాలపై దృష్టి పెడతాయి. వాతావరణ నిపుణులు ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. వాతావరణ శాస్త్రంలో విశేష కృషి చేసిన శాస్త్రవేత్తలకు అంతర్జాతీయ వాతావరణ బహుమతులు, విల్హో వైసెల్ అవార్డు, నార్బర్ట్ గెర్బియర్–మమ్ అవార్డు వంటి పురస్కారాలు అందజేస్తారు. కొన్నిసార్లు ప్రత్యేక తపాలా బిళ్ళలు, స్టాంపులు విడుదల చేస్తారు. వాతావరణ శాస్త్రం అన్ని రంగాలకు అనుసంధానమై ఉంది. వ్యవసాయం: వాతావరణ సమాచారం ఆధారంగా రైతులు పంటల సాగు చేస్తారు. రవాణా: విమానయాన, నౌకాశ్రయాలు, రైలు మార్గాలు వాతావరణ సమాచారంపై ఆధారపడి ఉంటాయి. విపత్తు నిర్వహణ: తుఫానులు, వరదలు, ఉష్ణప్రవాహాల వంటి విపత్తులపైనా ముందస్తు హెచ్చరికలు వాతావరణ శాస్త్రమే ఇస్తుంది. ఆరోగ్యం: వాతావరణ మార్పులు ప్రజల ఆరోగ్యంపైనా ప్రభావం చూపుతాయి. నీటి వనరుల నిర్వహణ: వర్షపాతం లెక్కలు, నీటి నిల్వలపై పరిశోధనలు వాతావరణ శాఖ చేయ గలుగుతుంది. ఈ దినోత్సవం ప్రకృతిని కాపాడాలన్న బాధ్యతను గుర్తు చేస్తుంది. వాతావరణాన్ని పరిరక్షించటం అంటే భవిష్యత్తు తరాల భద్రతను నిర్ధారించటం. మనం చేయగల చిన్న చర్యలు కూడా ప్రకృతిపై...వృక్షారోపణ, నీటి సంరక్షణ, పునర్వినియోగ సామగ్రి వినియోగం మొదలైన వాటిపై మంచి ప్రభావం చూపగలవు.

# జడ్జి ఇంట్లో నోట్ల కట్టలు ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి



న్యూఢిల్లీ : ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ అధికార నివాసంలో అగ్ని ప్రమాదం సమయంలో వెలుగు చూసినట్లుగా పేర్కొంటున్న భారీ నోట్ల కట్టల ఘటనపై సుప్రీం కోర్టు కొలీజియం శుక్రవారం ప్రాథమిక దర్యాప్తు ప్రారంభించింది. అలహాబాద్ హైకోర్టుకు ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ బదలీకి ఆయన అధికార నివాసంలో భారీ ఎత్తున నగదు స్వాధీనం ఉదంతంతో సంబంధం లేదని సుప్రీం కోర్టు శుక్రవారం స్పష్టం చేసింది.

నిర్దేశిత నిబంధనల ప్రకారం ఈ వ్యవహారంపై అంతర్గత దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు, బదలీ నిర్ణయాన్ని ప్రస్తుత దర్యాప్తుతో నిమిత్తం లేకుండా తీసుకున్నట్లు సర్వోన్నత న్యాయస్థానం స్పష్టీకరించింది. 'జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో ఘటనకు సంబంధించి తప్పుడు సమాచారాన్ని, వదంతులను వ్యాప్తి చేస్తున్నారు' అని సుప్రీం కోర్టు ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నది. నగదు దొరకడానికి ఆయన బదలీతో ముడిపెడుతున్న ఊహాగానాలను కోర్టు ఖండించింది. ఈ ఘటనకు సంబంధించిన సమాచారాన్ని, ఆధారాలను సేకరించి ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇప్పటికే అంతర్గత దర్యాప్తు ప్రారంభించారని కూడా సుప్రీం కోర్టు తెలియజేసింది. ఆ దర్యాప్తు నివేదికను భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ)కి అందజేయనున్నారు. సిజెఐ, అత్యంత సీనియర్ న్యాయమూర్తులు నలుగురితో కూడిన సుప్రీం కోర్టు కొలీజియం జస్టిస్ వర్మ బదలీకి సిఫార్సు చేసింది. తరువాత సుప్రీం కోర్టు కన్సల్టీ జడ్జీలు, సంబంధిత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులకు, జస్టిస్ వర్మకు లేఖలు పంపారు. వారి స్పందనలను ప్రస్తుతం పరిశీలిస్తున్నారు. అటుపిమ్మట కొలీజియం ఈ అంశంపై తీర్మానం ఆమోదిస్తుంది. ఢిల్లీ హైకోర్టు వెబ్‌సైట్ సమాచారం ప్రకారం, జస్టిస్ వర్మ 1992 ఆగస్టు 8న న్యాయవాదిగా నమోదు అయ్యారు. ఆయన 2014 అక్టోబర్ 13న అలహాబాద్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియుక్తుడయ్యారు.



## ఇండోనేషియాలో బద్దలైన అగ్నిపర్వతం

జకర్తా : ఇండోనేషియాలోని లెవొటబి లకి అగ్నిపర్వతం శుక్రవారం మూడుసార్లు బద్దలైంది. దీంతో దాదాపు 8వేల మీటర్ల (26,200 అడుగులు) ఎత్తున బూడిద చిమ్మింది. పరిస్థితి తీవ్రతను గమనించిన అధికారులు వెంటనే అగ్నిపర్వతం చుట్టుపక్కల 8కిలోమీటర్ల మేరా ప్రమాదకర ప్రాంతంగా ప్రకటించి తగు చర్యలు తీసుకున్నారు. తూర్పు నుసా తెంగ్గర ప్రావిన్స్‌లో ఫ్లోర్స్‌దీవిలో గల ఈ అగ్నిపర్వతం గత వారం రోజులుగా క్రియాశీలంగా వుంది. గురువారం అర్ధరాత్రి నుండి శుక్రవారం తెల్లవారు జాములోగా మూడుసార్లు బద్దలైంది. ఈ కారణంగా ఆస్ట్రేలియా, బాలి మధ్య పలు విమానాలు రద్దయ్యాయి. బాలికి వచ్చే పలు అంతర్జాతీయ, దేశీయ విమానాలు ఆలస్యమవుతున్నాయి. గత నవంబరులో కూడా ఈ అగ్నిపర్వతం ఇలాగే లావాను చిమ్మింది ఆ ప్రమాదంలో 9మంది మరణించగా, పలువురు గాయపడ్డారు.

## నమీబియాకు తొలి మహిళా అధ్యక్షురాలుగా నంది



విండ్‌హూక్ : ఆఫ్రికాలోని ఎడారి దేశం నమీబియాకు తొలి మహిళా అధ్యక్షురాలుగా నంది నదైత్వాహ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యను పరిష్కరించడమే తన ప్రాధాన్యత అని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో కనీసం ఐదు లక్షల ఉద్యోగాలను సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఇందుకోసం కనీసం ఐదు బిలియన్ డాలర్లు అవసరమవుతాయని తెలిపారు. వ్యవసాయం, మత్స్య పరిశ్రమ, సృజనాత్మకత, క్రీడా రంగంలో ఈ ఉద్యోగాలు సృష్టించబడతాయని చెప్పారు. నవంబర్ ఎన్నికల్లో నంది పార్టీ సౌత్‌వెస్ట్ ఆఫ్రికా పీపుల్స్ ఆర్గనైజేషన్ (ఎస్‌డబ్ల్యూఎపిఒ) 58 శాతం ఓట్లతో విజయం సాధించింది. దీంతో నంగోలో మ్బుంబా అధ్యక్షుడిగా, నంది ఉపాధ్యక్షురాలుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ ఏడాదితో నమీబియాకు స్వాతంత్ర్యం వచ్చి 35 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో మహిళను అధ్యక్షురాలుగా నియమించాలని ఎస్‌డబ్ల్యూఎపిఒ నిర్ణయం తీసుకుంది. దీంతో నంది నదైత్వాహ అధ్యక్షురాలుగా ఎన్నికయ్యారు. నమీబియా ప్రపంచంలోనే ప్రముఖ యురేనియం ఉత్పత్తిదారుగా ఉంది. వజ్రాలు, సహజవాయువు, చమురు నిక్షేపాలు సమృద్ధిగా ఉన్నాయి. 1990లో దక్షిణాఫ్రికా నుంచి స్వాతంత్ర్యం పొందింది.

# విద్యా శాఖను రద్దు చేసిన ట్రంప్



వాషింగ్టన్ : విద్యా శాఖను రద్దు చేస్తున్న ఉత్తర్వులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గురువారం సంతకాలు చేశారు. తద్వారా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చుకున్నానని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఫెడరల్ విద్యా శాఖను మూసివేసి, రాష్ట్రాలకు, స్థానిక కమ్యూనిటీలకు తిరిగి అధికారాలను అప్పగించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని విద్యా శాఖ మంత్రి లిండా మెక్‌మహన్ ఈ సందర్భంగా చెప్పారు. చట్టం అనుమతించిన మేరా అన్ని చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. మొత్తంగా ఒక శాఖను రద్దు చేయడమంటే ఆషామాషీ వ్యవహారం కాదని, దీనికి కాంగ్రెస్ అనుమతి కావాల్సి వుంటుందని ఆమె పేర్కొన్నారు. జనవరిలో ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తొలినాళ్ళలోనే విద్యా శాఖ సిబ్బందిని సగానికి సగం తగ్గించేశారు. విద్యా శాఖ కార్యకలాపాలను కూడా ప్రక్షాళన చేశారు. డజన్ల సంఖ్యలో కాంట్రాక్టులను ట్రంప్ సలహాదారు మస్క్ రద్దు చేశారు. అవన్నీ వృధా ఖర్చులని వ్యాఖ్యానించారు. 1979లో ఏర్పడిన ఈ విద్యా శాఖ ప్రధానంగా తక్కువ ఆదాయ వర్గాలకు చెందిన విద్యార్థులకు సాయపడేందుకు, విద్యార్థులకు రుణాలు అందించే కార్యక్రమాలను చూస్తుంది. కాలేజీలు, పాఠశాలలకు ఫెడరల్ ప్రభుత్వం నుండి అందే నిధులే ఇక్కడ కీలక పాత్ర పోషిస్తున్నాయి. క్లిష్టమైన జాతి సిద్ధాంతాలు, లింగ మార్పిడి, ఇతర అనుచితమైన వర్ణ, లైంగిక, రాజకీయ వైఖరులను ప్రోత్సహించే ఈ కాలేజీలు, స్కూళ్ళకు ఇక నిధులు అందించరాదని ట్రంప్ ప్రతిన చేశారు. కాగా మన పిల్లలను దోచుకుంటున్నారని హక్కుల కార్యకర్తలు, డెమోక్రాట్ సభ్యులు తీవ్రంగా విమర్శించారు. ట్రంప్ ఈ చర్యను పూర్తిగా అమలుపరచలేరని, వంద సీట్లు గల సెనెట్‌లో కనీసం 60మంది మద్దతు అవసరమవుతుందని విమర్శకులు పేర్కొంటున్నారు.

## జాతీయ ఉద్యమంగా మారిన పునర్విభజన..



చెన్నై : లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రం లోని బీజేపీకి, పలు రాష్ట్రాల ప్రభుత్వాల మధ్య వివాదం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో దీనిపై చర్చించేందుకు పలు రాష్ట్రాల నాయకులతో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మార్చి 22 న జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముందు స్టాలిన్ ఓ వీడియోను విడుదల చేశారు. అందులో జనాభా ప్రాతిపదికన విభజన జరిగితే రాష్ట్రాల హక్కులకు భంగం వాటిల్లుతుందని ఆయన ఆరోపించారు. శుక్రవారం ఎక్స్ వేదికగా ఓ వీడియోను పంచుకున్నారు. జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశానికి హాజరవుతున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, కర్ణాటక, ఒడిశా, పశ్చిమబెంగాల్, పంజాబ్ నాయకులకు నా హృదయ పూర్వక స్వాగతం . మార్చి 5న జరిగిన అఖిలపక్ష సమావేశం ఒకమైలు రాయి. 2026 ఏడాదిలో జరిగే పునర్విభజన జనాభా ప్రాతిపదికన జరిగితే పార్లమెంటులో మన ప్రాతినిధ్యం తీవ్రంగా దెబ్బతింటుంది. ఇది కేవలం ఎంపీల సంఖ్య గురించి మాత్రమే కాదు, రాష్ట్ర హక్కుల భంగం గురించి. అందుకే దీనిపై బీజేపీ తప్ప మిగిలిన పార్టీలన్నీ ఏకమయ్యాయి. తమిళనాడు లోని 58 పార్టీలు సైతం విభేదాలను పక్కనపెట్టి సముచితమైన పునర్విభజనకు ఒక్కటయ్యాయి. జనాభా ప్రాతిపదికన పునర్విభజనను తొలుత తమిళనాడు వ్యతిరేకించింది. దీనికి అన్ని రాష్ట్రాలు చేతులు కలపడంతో ప్రస్తుతం ఇది ఒక జాతీయ ఉద్యమంగా మారింది. " అని స్టాలిన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం జరిగే సమావేశం దేశ భవిష్యత్తును రూపొందించే ఉద్యమానికి నాంది అని ఆయన అభివర్ణించారు. ఈ నెల 5 న స్టాలిన్ నేతృత్వం లో చెన్నైలో అఖిలపక్ష సమావేశం జరిగింది. అందులో పునర్విభజనను వ్యతిరేకిస్తున్నట్టు అఖిలపక్ష సమావేశం తీర్మానించింది. పార్లమెంట్ సభ్యుల సంఖ్యను పెంచే పక్షంలో 1971 జనాభా లెక్కల ఆధారంగా ఇరు సభల్లో రాష్ట్రాల మధ్య ప్రస్తుతమున్న నిష్పత్తి మేరకు నియోజకవర్గాల సంఖ్యను పెంచడానికి అవసరమైన రాజ్యాంగ సవరణలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ క్రమంలో పునర్విభజన వల్ల జరిగే నష్టాలు, తీసుకోవాల్సిన నిర్ణయాలపై చర్చించేందుకు కలిసి రావాలని ఏడు రాష్ట్రాల సీఎంలకు స్టాలిన్ లేఖలు రాశారు. ఈ నెల 22న చెన్నైలో నిర్వహించే సమావేశానికి ప్రతినిధులను పంపాలని ఆయన అందులో కోరారు.

# గాజా పై దాడులు ముమ్మరం చేసిన ఇజ్రాయిల్



గాజా పై ఇజ్రాయిల్ దాడులు ముమ్మరం చేసింది, హమాస్ వద్ద బందీలుగా ఉన్నవారిని రక్షించేందుకు, ఒకపక్క వైమానిక దాడులతో పాటు, సముద్ర మార్గం నుంచి, భూ మార్గం నుంచిఇజ్రాయిల్ ముప్పేట దాడికి దిగింది. పాలస్తీనా లో హమాస్ అధీనంలో ఉన్న మరిన్ని ప్రాంతాలను స్వాధీనం చేసుకోవాలని సైన్యానికి కీలక ఆదేశాలు జారీ చేసింది.హమాస్ పై ఇజ్రాయిల్ మళ్లీ చేపట్టిన సైనిక చర్యకు అమెరికా అన్ని విధాలా మద్దతు ఇస్తోంది.హమాస్ వద్ద బందీలుగా ఉన్న ఇజ్రాయిల్ పౌరులను వెంటనే విడుదల చేయని పక్షంలో గాజాలోని మరిన్ని పట్టణాలను ఆక్రమించుకోవాలని ఇజ్రాయిల్ రక్షణ శాఖ మంత్రి ఇజ్రేల్ కట్జ్ సైన్యాన్నిఆదేశించారు. అక్కడి నుంచి పాలస్తీనియన్లను ఖాళీ చేయించి ఆ ప్రాంతాలను శాశ్వతంగా స్వాధీనం చేసుకుంటామని ఆయన హెచ్చరించారు.దాదాపు రెండు నెలల పాటు కాల్పుల విరమణ ముగియడం తో ఇజ్రాయిల్ త్రివిధ దళాలు ముమ్మరంగా చేపట్టిన ముప్పేట దాడితోకకావికలైన పాలస్తీనియన్లు ప్రాణాలు రక్షించు కొనేందుకు ఇతర ప్రాంతాలకు పారిపోతున్నారు. గాజా పై ఇజ్రాయిల్ మంగళవారం నాడు విమానాలద్వారా బాంబులవర్షం కురిపించడంతో 400 మందికి పైగా పాలస్తీనియన్లు చనిపోయారు.

ఆ తర్వాత జరిగిన దాడిలో మరో 85 మంది చనిపోయారు. కాల్పుల విరమణ ముగిసినప్పటి నుంచీ ఇప్పటివరకూ 592 మంది పాలస్తీనియన్లు మరణించారు.హమాస్ వద్ద బందీలుగా ఉన్న వారిని రక్షించుకునే హక్కు ఇజ్రాయెల్ కు ఉందని, హమాస్ తమవద్ద బందీలుగా ఉన్న వారందరినీ స్వేచ్ఛగా విడిచి పెట్టి ఉంటే,

ఇజ్రాయిల్ కాల్పుల విరమణను పొడిగించేదని, కానీ, హమాస్ అందుకు అంగీకరించకుండా వారు యుద్ధాన్నే కోరుకున్నారని అమెరికా నేషనల్ సెక్యూరిటీ సలహాదారు మైకి విల్ట్ జ్ పేర్కొన్నారు.

# కర్నాటక అసెంబ్లీలో 18 మంది బిజెపి ఎమ్మెల్యేల సస్పెన్షన



బెంగళూరు : కర్నాటక శాసనసభలో స్పీకర్ యుటి ఖాదర్ పట్ల 'గౌరవం చూపనందుకు' 18 మంది బిజెపి ఎంఎల్‌ఎలను ఆరు నెలల పాటు శాసనసభలో నుంచి శుక్రవారం సస్పెండ్ చేశారు. రాష్ట్ర న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి హెచ్‌కె పాటిల్ ప్రతిపాదించిన సస్పెన్షన్ తీర్మానాన్ని అసెంబ్లీ ఆమోదించింది. అసెంబ్లీ బడ్జెట్ సెషన్ చివరి రోజు శుక్రవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. ప్రతిపక్ష బిజెపి ఎంఎల్‌ఎలు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్పీకర్ ఖాదర్ ఆసనం ఉన్న వేదికపైకి శాసనసభ్యులు ఎక్కి ఆయనపైకి కాగితాలు విసరివేశారు. ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ కేటాయింపుపై ఆగ్రహించిన ప్రతిపక్షం నిరసనకు దిగింది. అంతకుముందు బడ్జెట్‌పై చర్చకు ముఖ్యమంత్రి సమాధానం ఇస్తుండగానే బిజెపి సభ్యులు ప్రభుత్వం ఒక మంత్రిని 'హనీ ట్రాప్'లో ఇరికించే యత్నం చేసిందని ఆరోపిస్తూ సభ మధ్యంలోకి వెళ్లి నిరసన ప్రదర్శన నిర్వహించి, ఈ వ్యవహారంపై న్యాయ విచారణ జరిపించాలని కోరారు. సస్పెండైన ఎంఎల్‌ఎలలో బిజెపి చీఫ్ విప్ దొడ్డన్న గౌడ పాటిల్, సిఎన్ అశ్వథ్ నారాయణ్, ఎస్‌ఆర్ విశ్వనాథ్, బిఎ బసవరాజు, ఎంఆర్ పాటిల్, చన్నబసప్ప, బి సురేష్ గౌడ, ఉమానాథ్ కొటియన్, శరణు సలాగర్, డాక్టర్ శైలేంద్ర బెల్లదలె, సికె రామమూర్తి, యశ్‌పాల్ సువర్ణ, బిపి హరీష్, భరత్ శెట్టి, ధీరజ్ మునిరాజు, చంద్రు లమని, మునిరత్న, బసవరాజ్ మట్టిమూడ్ ఉన్నారు. ఖాదర్ సస్పెన్షన్ ఉత్తర్వు చదువుతూ, 'ఈ సంఘటన మమ్మల్ని ఎంతగానో నొప్పించింది. బాధాకరం, ఈ సీటు కేవలం సభాపతి స్థానం కాదు. ఇది ప్రజాస్వామ్యం, సత్యం, న్యాయం ప్రతీక. ఈ పీఠం నుంచి మాట్లడడం గర్వకారణం. ప్రతి సభ్యుడు ఈ స్థానం గౌరవాన్ని, పవిత్రతను కాపాడాలి.

## గాజాలో మరింత భూభాగం ఆక్రమించండి

ఇజ్రాయెల్ : గాజా లోని మరింత భూభాగాన్ని ఆక్రమించాలని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్)ను దేశ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ ఆదేశించారు. మరింత మంది బందీలను విడుదల చేసేందుకు హమాస్ నిరాకరించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఓ ఆంగ్ల వార్తా సంస్థ పేర్కొంది. గాజా పట్టీలోని అదనపు ప్రదేశాలను ఆక్రమించాలని కాట్జ్ ఆదేశాల్లో పేర్కొన్నారు. ఇప్పటికే పాలస్తీనా పౌరులు ఉన్న ప్రదేశాలను ఖాళీ చేయాలని ఐడీఎఫ్ బలగాలు హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. "ఐడీఎఫ్ బలగాలు, ఇజ్రాయెల్ ప్రజలను రక్షించేందుకు గాజాలో సెక్యూరిటీ జోన్లను విస్తరించండి.న బందీలను విడుదల చేసేందుకు హమాస్ జాప్యం చేసేకొద్దీ, మరింత భూమిని కోల్పోతుంటుంది. దానిని ఇజ్రాయెల్‌లో విలీనం చేసుకొంటుంది " అని కాట్జ్ ఆదేశాల్లో పేర్కొన్నారు. బుధవారం రాత్రి నుంచి ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 85 మంది పాలస్తీనియన్లు మృతి చెందారు. 133 మందికి గాయాలయ్యాయి.

# ఉక్రెయిన్ ఇంధన వనరులపై మేం దాడులు చేయలేదు:



మాస్కో: రష్యాఉక్రెయిన్ మధ్య యుద్ధం ముగింపు చర్చల్లో భాగంగా ఉక్రెయిన్ ఇంధన, మౌలిక సదుపాయాలపై నెల పాటు దాడులు నిలిపివేసేలా అమెరికా, రష్యాల మధ్య అంగీకారం కుదిరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఒప్పందం ఉల్లంఘనకు గురైందంటూ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఇటీవల చేసిన ఆరోపణల్లో నిజం లేదని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ పేర్కొన్నారు. ఉక్రెయిన్ సరిహద్దుకు సమీపంలో ఉన్న ఓ రష్యన్ ఇంధన కేంద్రం రాత్రి సమయంలో దగ్ధమైందని, దీనిని చూపించి కీవ్ లోని ఇంధన వనరులపై దాడులు చేస్తున్నామని జెలెన్‌స్కీ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. జెలెన్‌స్కీ మాటలను ఎంతవరకు నమ్మవచ్చో దీని ద్వారా తెలుసుకోవాలని ప్రపంచ దేశాలను ఆయన కోరారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ , రష్యా అధినేత పుతిన్‌తో ఫోన్‌లో జరిపిన చర్చల్లో యుద్ధాన్ని విరమింప చేయడంలో భాగంగా ఇంధన, మౌలిక సదుపాయాలపై నెలరోజుల పాటు దాడులు నిలిపేలా చూడాలని అమెరికా, రష్యా ఒప్పందం చేసుకున్నాయి. దీనికి ముందుగా ఈ రెండు రంగాల వరకు దాడులు ఆపాలని ట్రంప్ సూచించారు. దీనికి పుతిన్ అంగీకరించారని, శాంతి దిశగా ఇది తొలి అడుగు అని అమెరికా అధ్యక్ష కార్యాలయం తెలిపింది. నల్లసముద్రంలో దాడుల విరమణకు, ఆ తర్వాత పూర్తిగా యుద్ధం అంతానికి ఇది దారి తీస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది.

## మా జోలికొస్తే అమెరికాకు గట్టి ఎదురుదెబ్బ తగులుతుంది



టెహ్రాన్ :యెమెన్ లోని హూతీలపై అమెరికా భీకర స్థాయిలో విరుచుకుపడుతున్న విషయం తెలిసిందే. ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హూతీ తిరుగుబాటు దారుల చర్యలకు ఇరాన్‌తో ముడిపెడుతూ , తదుపరి దాడులకు పాల్పడితే టెహ్రాన్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ఆయన వ్యాఖ్యలపై తాజాగా ఇరాన్ సుప్రీం లీడర్ అయాతుల్లా అలీ ఖమేనీ స్పందించారు. యెమెన్‌కు చెందిన హూతీలు తాము చెప్తే దాడులకు పాల్పడలేదని, ఆ విషయంలో వారికి సొంత కారణాలు ఉన్నాయని పేర్కొన్నారు. తాము ఎప్పుడూ ఎవరితోనూ ఘర్షణలు ప్రారంభించలేదని, అలా అని ఎవరైనా తమ జోలికి వస్తే మాత్రం ఊరుకోమని అన్నారు. సంబంధం లేని విషయాల్లో టెహ్రాన్‌పై అనవసర ఆరోపణలు చేస్తే అమెరికాకు గట్టి దెబ్బ తగులుతుందని హెచ్చరించారు. ఇటీవల హూతీలపై అమెరికా దాడులు చేస్తోంది. హూతీల ప్రతి కదలికలను ఇరాన్ నిర్దేశిస్తోందని, ఆయుధాలు, నగదు , అత్యాధునిక సైనికసామగ్రితోపాటు నిఘా సమాచారాన్ని పంచుకుంటోందని ట్రంప్ ఆరోపించారు. ప్రపంచ జలమార్గాల్లో అమెరికా వాణిజ్య ,నౌకాదళ నౌకలను ఏ ఉగ్రవాద దళమూ ఆపలేదని అన్నారు.

# ఆ వార్తలు కేవలం ఊహాగానాలు..

-మొదటిపేజీ తరువాయి

అందజేశారు. ఈ సమావేశానికి జనసేన హాజరైనట్లు వచ్చిన వార్తలు కేవలం ఊహాగానాలు మాత్రమేనని ఆ పార్టీ అగ్ర నేతలు తేల్చిచెప్పారు. వేర్వేరు కూటములుగా ఉన్నందున ఈ సమావేశంలో పాల్గొనడం లేదని మర్యాదపూర్వకంగా తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనపై వారి అభిప్రాయాలు వారికి ఉన్నట్లే.. ఈ అంశంపై తమ విధానం తమకు ఉందని అన్నారు. ఈ విషయంపై తమ విధానాన్ని త్వరలో వెల్లడిస్తామని జనసేన అగ్రనేతలు స్పష్టం చేశారు.

ఈ అఖిలపక్ష సమావేశానికి హాజరు కావాల్సిందిగా ఆహ్వానం అందిందని, కానీ తాము హాజరు కాలేమని సమాచారం అందించినట్లు పేర్కొంది. వేర్వేరు కూటములుగా ఉన్నందున సమావేశంలో పాల్గొనడం కుదరదని మర్యాదపూర్వకంగా తెలియజేయాలని తమ అధినేత పవన్ కల్యాణ్ సూచన మేరకు వారికి సమాచారం ఇచ్చినట్లు జనసేన పేర్కొంది. ఇక డీలిమిటేషన్ పై వారికి ఒక అభిప్రాయం ఉన్నట్లే, తమకు ఓ విధానం ఉందని, ఈ విషయాన్ని సరైన వేదికపై వెల్లడిస్తామని లేఖలో పేర్కొనడం జరిగింది.

ఇదిలాఉంటే... కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రతిపాదించిన డీలిమిటేషన్ ను తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. 2026 జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాల పూనర్విభజనను అంగీకరించడం లేదు. ఇదే విషయమై జాతీయ స్థాయిలో ఉద్యమించేందుకు స్టాలిన్ సిద్ధమవుతున్నారు. ఇందుకోసం దక్షిణాది రాష్ట్రాల ప్రజా ప్రతినిధుల మద్దతు కూడగడుతున్నారు. ఇందులో భాగంగానే ఈరోజు చెన్నైలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ నుంచి సీఎం రేవంత్ రెడ్డి హాజరైన విషయం తెలిసిందే.

కేంద్ర ప్రభుత్వ విధానంపై నేతల చర్చ..

తమిళనాడు సీఎం స్టాలిన్ అధ్యక్షతన చెన్నైలో దక్షిణాది రాష్ట్రాలకు సంబంధించిన ముఖ్యమంత్రులు, ప్రతిపక్షాల నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ భేటీకి తెలంగాణ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి హాజరయ్యారు. కేరళ సీఎం పినరయి విజయన్, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ పాల్గొన్నారు. వీరంతా నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాదికి కలిగే నష్టాలపై చర్చించారు. డీలిమిటేషన్‌పై కేంద్ర ప్రభుత్వ విధానాలను నేతలు తప్పు పట్టారు. కేంద్రానికి వ్యతిరేకంగా ఎలా కలిసి వెళ్లాలనే అంశంపై ఈ సమావేశంలో చర్చించారు.

# రాష్ట్రానికి అన్యాయం జరగకుండా డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టాలి

-మొదటిపేజీ తరువాయి

ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. నియోజకవర్గాల పునర్ విభజన ప్రజాస్వామ్య సమాఖ్య స్ఫూర్తిని నిలబెట్టాలన్నారు. లోక్‌సభ లేక రాజ్యసభలో ఏ రాష్ట్రానికీ సీట్ల వాటా తగ్గకుండా డీలిమిటేషన్ ప్రక్రియ జరగాలని కోరారు. ప్రతి ప్రాంతం యొక్క గొంతకకు సమాన ప్రాధాన్యం కల్పించేలా చూడాలని ప్రధాని మోదీకి రాసిన లేఖలో వైఎస్ జగన్ పేర్కొన్నారు. లోక్‌సభ, రాజ్యసభలో ఏ రాష్ట్రానికి ప్రాతినిథ్యం తగ్గకూడదు. సీట్ల సంఖ్య విషయంపై కేంద్రం దక్షిణాదికి అన్యాయం జరగకుండా చూడాలి. దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతున్న విషయాన్ని మీ దృష్టికి తీసుకొస్తున్నాను. డీలిమిటేషన్ ద్వారా కొన్ని రాష్ట్రాల్లో సీట్లు తగ్గుతాయి. దాని వల్ల చట్టాల రూపకల్పన, సవరణలలో దక్షిణాది రాష్ట్రాల ప్రభావం ఏమాత్రం ఉండదు. రాజకీయంగానే కాదు ప్రజల ప్రయోజనాల్ని ఇది దెబ్బతీస్తుంది. డీలిమిటేషన్ ప్రక్రియ జరిగితే కనుక ఏ ప్రాంతానికి అన్యాయం జరగకుండా జాగ్రత్తగా చేయాలి. 84వ రాజ్యాంగ సవరణ ద్వారా డీలిమిటేషన్ ప్రక్రియ జరగనుంది. 2026 నాటికి ఈ ప్రక్రియ పూర్తి కావాలి. కోవిడ్19 కారణంగా 2021లో ప్రారంభించాల్సిన జనాభా లెక్కలు తేల్చలేదు. జనాభా సర్వే లెక్కలు తేల్చిన తరువాత నియోజకవర్గాల పునర్ విభజన ప్రక్రియ ఉంటుంది.జనాభా నియంత్రణ కోసం పలు రాష్ట్రాలు అనేక విధానాలు అమలు చేశాయి. దీని వల్ల వివిధ రాష్ట్రాల్లో జనాభా పెరుగుదల హెచ్చుతగ్గులున్నాయి. దేశవ్యాప్తంగా జనాభా వృద్ధి ఒకే తరహాలో లేదు. దీని వల్ల డీమిలిటేషన్ ఆందోళనకు దారి తీస్తోంది. 42, 84వ రాజ్యాంగ సవరణల ద్వారా ఆయా రాష్ట్రాలకు సీట్ల కేటాయింపును నిలిపేశారు. దేశ జనాభాలో ఆయా రాష్ట్రాల వాటా 1971 నాటి స్థాయికి



చేరుకుంటుందని భావించారు. కానీ, 2011 జనాభా లెక్కలు చూస్తే జనాభా వృద్ధి, దాని అంచనాలు అన్ని రాష్ట్రాల్లో ఒకేలా లేవు. 1971, 2011 మధ్య 40 ఏళ్లలో దేశ జనాభాలో దక్షిణాది రాష్ట్రాల వాటా తగ్గింది.1971 లెక్కల ప్రకారం దక్షిణాది రాష్ట్రాల జనాభా వృద్ధి రేటు 24.08 శాతం, 2011 జనాభా లెక్కల ప్రకారం జనాభా వృద్ధి రేటు 20.88 శాతం. ఇప్పుడున్న జనాభా లెక్కలను ఆధారంగా చేసుకుని డీలిమిటేషన్ ప్రక్రియ జరిగితే దక్షిణాది రాష్ట్రాల భాగస్వామ్యం గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. దామాషా ప్రకారం అన్ని రాష్ట్రాలకు సీట్ల పెరుగుదల అంశాన్ని దృష్టిలో ఉంచుకుని డీలిమిటేషన్ చేపడతామని హోం మంత్రి అమిత్‌షా హామీ ఇచ్చినందుకు కృతజ్ఞతలు. ఆర్టికల్ 81 (2) (ఎ) ప్రకారం జనాభా ప్రాతిపదికన ఆయా రాష్ట్రాలకు సీట్ల కేటాయింపు జరగాలి. ఈ నిబంధనతో హోంమంత్రి అమిత్‌షా ఇచ్చిన హామీని అమలులో అడ్డంకులు ఏర్పడతాయి. అందువల్ల దామాషా ప్రకారం ప్రతి రాష్ట్రానికి సీట్ల కేటాయింపుపై రాజ్యాంగ సవరణ చేయాలి. దాంతో ఆయా రాష్ట్రాల ప్రాతినిథ్యం తగ్గుతుందనే అంశం ఉత్పన్నం కాదు అని లేఖలో జగన్ పేర్కొన్నారు.

# రాధా... రాం...రాం..

**విజయవాడ :** వంగవీటి రాధా.. ఈ పేరు ఉమ్మడి కృష్ణా, గుంటూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో చాలా ఫేమస్. అందుకు కారణం ఆయన తండ్రి రంగా. కాపుల కోసం ఎన్నో ఉద్యమాలు చేసిన రంగా.. దారుణ హత్యకు గురయ్యారు. ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చిన రాధా.. ఒక్కసారి ఎమ్మెల్యే అయ్యారు. ఆ తర్వాత ఏ పదవీ రాలేదు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే రాజకీయ రాజధాని విజయవాడ. అలాంటి బెజవాడలో రాజకీయంగా చక్రం తిప్పింది వంగవీటి కుటుంబం. వంగవీటి రాధా (రంగా సోదరుడు) హత్య తర్వాత విజయవాడ రాజకీయం పూర్తిగా మారిపోయింది. రంగా ప్రవేశంతో వేడెక్కింది. 1985లో రంగా కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యే అయ్యారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో.. రంగా జైలుకు వెళ్లాల్సి వచ్చింది. రంగా జైల్లో ఉండగానే.. 1988 జులై 10న జరిగిన కాపునాడు సభలో ఆయనను తమ నాయకుడిగా ఎన్నుకున్నారు. ఆ తర్వాత జైలు నుంచి విడుదలైన రంగా.. జనచైతన్య యాత్ర చేసి ఎన్.టి.రామారావు ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు. పోలీసులు ఆధిపత్యం చెలాయిస్తున్నారని పోరాడారు. పేదల కోసం, బలహీన వర్గాల కోసం ఆయన అనేక ఉద్యమాలు చేశారు. విజయవాడలోని గిరిపురంలోని పేదల ఇళ్ల పట్టాల కోసం ఆయన నిరాహార దీక్ష చేశారు. కాపు సామాజిక వర్గాన్ని ఏకతాటిపైకి తెచ్చేందుకు ప్రయత్నించారు.1988 డిసెంబర్ 26న పేదల ఇళ్ల పట్టాల కోసం నిరాహార దీక్ష చేస్తున్న రంగాను.. ప్రత్యర్థులు దారుణంగా హత్య చేశారు. ఆయన హత్య తర్వాత కోస్తాంధ్రలో పెద్ద ఎత్తున హింస చెలరేగింది. కేసులు, అరెస్టులు, గొడవలు, ధర్నాలు జరిగాయి. చాలా రోజుల తర్వాత రంగా కుమారుడు రాధా రాజకీయ రంగప్రవేశం చేశారు. 2004లో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆ తర్వాత చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీలో చేరారు2009లో విజయం దక్కలేదు. ఆ తర్వాత కొన్నాళ్లకు జగన్ సారథ్యంలోని వైసీపీలో చేరారు వంగవీటి రాధా. 2014లోనూ అదృష్టం వరించలేదు. 2019 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. అప్పుడు ఎక్కడా పోటీ చేయలేదు. పార్టీ అధికారంలోకి వస్తే.. ఎమ్మెల్సీ పదవి ఇస్తారని ప్రచారం జరిగింది. కానీ.. టీడీపీ అధికారంలోకి రాలేదు. ఎమ్మెల్సీ పదవి ఇవ్వలేదు. 2019 నుంచి 2024 వరకూ ఆయన తెలుగుదేశం పార్టీలోనే కొనసాగారు.2024 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఎక్కడా పోటీ చేయలేదు. కానీ.. పార్టీకోసం ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని పలు నియోజకవర్గాల్లో



ప్రచారం చేశారు. ముఖ్యంగా కాపులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో రాధా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి అధికారంలోకి వచ్చింది. ఇక రాధాకు పదవీ ఖాయం అని ఆయన అనుచరులు అనుకున్నారు. మొదటి నామినేటెడ్ పోస్టు వస్తుందని ఆశించారు. రాలేదు.ఆ తర్వాత రాజ్యసభకు పంపుతారనే ప్రచారం జరిగింది. అదీ కుదరలేదు. ఇక ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాధాకు ఎమ్మెల్యే కోటాలో అవకాశం వస్తుందని ఊహించారు. అదీ జరగలేదు. దీంతో ఆయన అనుచరులు.. తీవ్ర అసంతృప్తితో ఉన్నారనే టాక్ ఉంది. ఇన్నాళ్లుగా ఏ పదవి లేదని.. ఇప్పుడు అధికారంలో ఉన్నా.. ఎందుకు ఇవ్వడం లేదని రాధా అనుచరులు ప్రశ్నిస్తున్నారు.అటు రాధా కూడా ఆయనకు కనీస గౌరవం దక్కలేదని, తన సేవలను గుర్తించలేదని తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నట్లుగా తెలుస్తోంది. దీంతో ఏ పార్టీలోకి వెళ్లినా ఇదే పరిస్థితి ఉంటుందని భావించిన రాధా.. రాజకీయాలకు పూర్తిగా గుడ్ బై చెప్పే యోచనలో ఉన్నారని ప్రచారం జరుగుతోంది. ఈ మధ్య రంగా, రాధా మిత్రమండలి సమావేశంలో కూడా తీవ్ర నైరాశ్యంతో మాట్లాడినట్టు సోషల్ మీడియాలో పోస్టులు వచ్చాయి. దీంతో ఆయన రాజకీయాలకు గుడ్ బై చెప్పే ఆలోచనలో ఉన్నారనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.. 'రాధా రాజకీయాలకు ఎందుకు గుడ్ బై చెప్తారు.. అలాంటిది ఏం లేదు. ఆయన చాలా కంఫర్ట్‌గా ఉన్నారు. రాధాకు ఎప్పుడు ఏ పదవి ఇవ్వాలో పార్టీ నిర్ణయిస్తుంది. అప్పటివరకు ఓపికగా ఉంటాం. కొందరు కావాలని తప్పుడు చేస్తున్నారు. రాధా రాజకీయాల్లోనే ఉంటారు. ఆ మధ్య కాస్త అనారోగ్య సమస్యల వల్ల యాక్టివ్‌గా లేరంతే' అని రాధా మిత్రుడు చెప్పారు.

## సిఫార్సు లేఖలపై తెలంగాణ ప్రజాప్రతినిధుల శ్రీవారి దర్శనం

-మొదటిపేజీ తరువాయి

శ్రీ విశ్వావసు నామ సంవత్సర తెలుగు ఉగాది ఆస్థానాన్ని పురస్కరించుకుని మార్చి 25వ తారీఖున మంగళవారం నాడు శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరగనున్న నేపథ్యంలో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేయబడ్డాయి. ఈ కారణంగా మార్చి 25వ తేదిన వీఐపీ బ్రేక్ దర్శనం కొరకు మార్చి 24వ తారీఖున ఎటువంటి సిఫార్సు లేఖలు స్వీకరించబడవని భక్తుల స్పష్టత కొరకు మరోసారి తెలియజేయడమైనది. అదేవిధంగా ఇప్పటివరకు సోమవారం వీఐపీ బ్రేక్ దర్శనానికి గాను ఆదివారం ఆంధ్ర ప్రజా ప్రతినిధుల నుండి స్వీకరిస్తున్న సిఫార్సు లేఖలు ఇకపై శనివారం నాడు (ఆదివారం దర్శనం కొరకు) స్వీకరించబడతాయని కూడా టీటీడీ గతంలోనే స్పష్టం చేసింది. అయితే మార్చి 30వ తారీఖున ఆదివారంనాడు శ్రీవారి ఆలయంలో ఉగాది ఆస్థానాన్ని పురస్కరించుకుని వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ కారణంగా మార్చి 29వ తారీఖున శనివారం నాడు ఎటువంటి సిఫార్సు లేఖలు స్వీకరించబడవని మరోసారి టీటీడీ స్పష్టం చేస్తోంది. ఈ మార్పులను భక్తులు దృష్టిలో ఉంచుకొని టిటిడికి సహకరించవలసిందిగా కోరడమైనది.

## వారిపై కఠినంగా ఉండాలి..

-మొదటిపేజీ తరువాయి

రగిల్చేలా కుట్ర చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సీఎం చంద్రబాబు కోరారు. పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలని, వివిధ వర్గాల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టే వారిపై నిఘా ఉంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు.

## ఆ విజయానికి కారణం చంద్రబాబే

-మొదటిపేజీ తరువాయి

హామీ పథకానికి ప్రధానంగా కావాల్సింది కష్టపడి పనిచేయడమే అని తెలిపారు. రాయలసీమలో నీటి కష్టాలు అధికంగా ఉండేదన్నారు. భారీ వర్షాలు పడితే నీటి నిల్వ సౌకర్యం రాయలసీమలో లేదన్నారు. మే నెలలోపూ లక్షా 55 వేల నీటి కుంటలు పూర్తి అవ్వాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వర్షాల సమయంలో లక్షా 55 వేల నీటి కుంటలు నిండితే ఒక టీఎంసీ నీళ్లు వస్తాయన్నారు. శ్రీకృష్ణదేవరాయలు చెప్పినట్లు రాయలసీమ రతనాల సీమ అవ్వాలన్నారు. అభివృద్ధి కొందరికే పరిమితం కాదని.. అందరికీ కావాలన్నారు. ఒకే రోజు 13326 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించామని చెప్పుకొచ్చారు. పని చేసే సత్తా ఉందని.. పని కోసం దిశానిర్దేశం చేసే ఏ స్వార్థం లేని వ్యక్తులు కావాలన్నారు. రాష్ట్రం బాగుండాలని సీఎం కోరుకున్న విధంగా.. ఆయనను ప్రేరణగా తీసుకుని తనకు ఇచ్చిన శాఖలను బలంగా చేయాలని ఒకే రోజు 13326 గ్రామసభలు నిర్వహించి.. అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పనుల జాబితాను రూపొందించి ప్రపంచ రికార్డు సాధించామన్నారు. పంచాయతీరాజ్ పరిపాలనా వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చేందుకు మంత్రివర్గం పరిపాలనా సంస్కరణలను ఆమోదించిందన్నారు. గ్రామీణ ప్రజల జీవితాన్ని మెరుగుపరిచేందుకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చామన్నారు. రాష్ట్రంలో 52.92 లక్షల కుటుంబాల్లో 97.44 లక్షల మందికి ఉపాధి కూలీలకు స్వగ్రామాల్లో ఉపాధి కల్పించామన్నారు. ఈ పథకం కింద రూ.9.5 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. ప్రజలకు ఉపాధి ఆర్థికత స్థిరత్వం కల్పించేందుకు చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఒక అడుగు ముందే ఉంటుందన్నారు.

గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో 4వేల పైచిలుకు రోడ్లు మాత్రమే నిర్మించారని, ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన ఎనిమిది నెలల్లోనే దాదాపు 4వేల కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం జరిగింది. రూ.1600 కోట్ల వ్యయంతో రోడ్లను నిర్మించినట్లు చెప్పారు. 100 మందికిపైగా ఉన్న గిరిజన గ్రామాల్లో రహదారి సౌకర్యం కల్పించామన్నారు. గిరిజన గ్రామాల్లో విద్యుత్, తాగునీరుతో పాటు మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. లక్షా 55 వేల పంట కుంటలు నిండితే మనకు ఇబ్బంది ఉండదని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చెప్పుకొచ్చారు.

## చెరువుల తవ్వకాలకు బ్రేక్...

**కాకినాడ :** ఒకప్పుడు ఆహ్లాదకరమైన సువిశాల సాగర తీరం ఉండేది. సునామీ, తుపాన్ల వంటి విపత్తుల నుంచి కాపాడేలా ఇసుక తెన్నెలు పుష్కలంగా కనపడేవి. కానీ ఇప్పుడు కనుచూపు మేరలో చెరువులే కనిపిస్తున్నాయి. తీరం వెంబడి పచ్చని గోడలా సరుగుడు తోటలతో గ్రీన్ బెల్ట్ ఉండేది. కానీ ఇప్పుడు మొత్తం ఆక్వా కాలుష్యంతో నిండిపోయింది. ఏకంగా సముద్రానికి ఆనుకుని మరీ చెరువులు తవ్వేయడం ఆందోళనకరంగా మారింది. ఈ అక్రమ కార్యకలాపాల వల్లనే సముద్రకోతకు గురి అవుతోంది. సీఆర్‌జడ్ పరిధి నానాటికీ ముందుకు చొచ్చుకు వచ్చే పరిస్థితి ఉత్పన్నమైంది. విచిత్రమేంటంటే సీఆర్‌జడ్ పరిధిలోకి వచ్చే ఈ ఆక్వా చెరువులకు ఎటువంటి అనుమతులు లేవు. అయినా ప్రభుత్వం అందించే సబ్సిడీ విద్యుత్తు సరఫరా పుష్కలంగా లభిస్తోంది. ఆక్వా చెరువుల దందాపై కొందరు జాతీయ గ్రీన్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. దీంతో గ్రీన్ ట్రైబ్యునల్ సభ్యులు అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండల పరిధిలోని అంతర్వేదిలో పర్యటించారు. స్వయంగా అక్కడ జరిగే అక్రమాలను సభ్యులు పరిశీలించారు. తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. తీరం వెంబడి అక్రమంగా తవ్వేసిన ఆక్వా చెరువులను ధ్వంసం చేసి పూడ్చాలని ఆదేశించారు. లేకుంటే స్థానిక అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. స్పందించిన జిల్లా యంత్రాంగం ఆదిశగా చర్యలకు ఉపక్రమించింది.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో అంతర్వేది నుంచి తుని మండలం అద్దరిపేట వరకు సముద్ర తీరం విస్తరించి ఉంది. ఇందులో అంబేడ్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా విస్తరించి ఉన్న సముద్రతీరం వెంబడి విచ్చలవిడిగా చెరువులు తవ్వకాలు చేసి ఆక్వాసాగు చేస్తున్నారు. ప్రధానంగా అంతర్వేది గ్రామ పరిధిలో తీరప్రాంతం మొత్తం ఆక్వాసాగుగా మారిపోయింది. ఈ చర్యల వల్ల భారీగా తీరం కోతకు గురవుతోంది. ఈ అక్రమ ఆక్వా చెరువులపై జిల్లా అధికారులకు ఎన్నోసార్లు ప్రజలు ఫిర్యాదు చేశారు. చెరువులు ధ్వంసం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రయోజం లేకపోవడంతో రాజోలు ప్రాంతానికి చెందిన ఎన్ఆర్ఐ యనుమల రాజా గ్రీన్ ట్రైబ్యునల్‌లో పిటిషన్ వేశారు. హైకోర్టును కూడా ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ట్రైబ్యునల్ క్షేత్రస్థాయిలో పరిశీలనకు ఆదేశాలు జారీ చేసింది. జాతీయ గ్రీన్ ట్రైబ్యునల్ బృందం ఈ ప్రాంతాన్ని పరిశీలించింది. అంతర్వేది సముద్ర తీరం మొత్తం ఆక్వాపరం కావడంతో ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఇప్పుడు తాజాగా జిల్లా కలెక్టరు, ఎస్పీలకు ఆక్వాచెరువులను ధ్వంసం చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఉత్తర్వులు జారీ చేయడంతో అధికారులు తక్షణ చర్యలకు ఉపక్రమించారు. అయితే కొందరు దీనిని అడ్డుకోవడంతో అధికారులు భారీ పోలీసు బందోబస్తుతో చెరువుల ధ్వంసం చేస్తున్నారు. అంతర్వేది సముద్రతీర ప్రాంతంలోనే కాకుండా అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల పరిధిలోని తీరం వెంబడి ఉన్న ఆక్వాచెరువులు ధ్వసం చేయాలని డిమాండ్ వినిపిస్తోంది. కోనసీమవ్యాప్తంగా సఖినేటిపల్లితోపాటు మలికిపురం, మామిడికుదురు, అల్లవరం, కాట్రేనికోన, ముమ్మిడివరం, ఐ.పోలవరం, తాళ్లరేవు మండలాల పరిధిలో తీరానికి ఆనుకుని ఉన్న అక్రమ ఆక్వాచెరువులు ధ్వంసం చేయాలని పర్యావరణవేత్తలు డిమాండ్ చేస్తున్నారు..

## పోసాని చుట్టూ కేసుల వలయం

**గుంటూరు :** పోసాని కృష్ణమురళికి సీఐడీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో పోలీసులు ఇప్పటికే ఆయనను ఓ రోజు కస్టడీకి తీసుకుని విచారించారు. బెయిల్ పిటిషన్ దాఖలు చేయడంతో విచారణ జరిపిన కోర్టు బెయిల్ మంజూరు చేసింది. మార్ఫింగ్ ఫోటోలు చూపించి చంద్రబాబు,లోకేష్, పవన్ లను దూషించిన వ్యవహారంపై ఆయనపై ఓ టీడీపీ నాయకుడు కేసు పెట్టారు. సమాజంలో వర్గాల మధ్య ద్వేషాన్ని పెంచి అల్లర్లు చెలరేగే కుట్ర చేశాడన్న కారణంగా ఆయనను అరెస్టు చేశారు. ఇప్పటికే ఆయనపై ఇతర కేసులు చాలా ఉన్నాయి. వాటిలో ఆయనకు బెయిల్ మంజూరు అయింది. ఇక కర్నూలు జైలు నుంచి విడుదల అవుతారు అనుకున్న సమయంలో సీఐడీ పోలీసులు పీటీ వారెంట్ పై అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. సీఐడీ కోర్టులో హాజరుర పరిచినప్పుడు 70 ఏళ్ల వయసులో తనను అనేక ప్రాంతాల్లో తిప్పుతున్నారని... అసలు ఎన్ని కేసులు ఉన్నాయో చెప్పడంలేదని వాపోయారు.